ప్రజాశక్తి
శుక్రవారం 18 నవంబరు 2022
5
శ్రీకాకుళం



వచ్చే నెలలో హెవీ డ్రైవింగ్ శిక్షణ

శ్రీకాకుళం : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ద్వారా వచ్చే నెల మొదటి వారంలో 11వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం కానున్నదని ఎపిఎస్ఆర్‌టిసి శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ ద్వారా ఇప్పటికే 10 బ్యాచ్‌లను విజయవంతంగా శిక్షణ ఇచ్చామన్నారు. డ్రైవింగ్‌లో మంచి మెలకువలతో పాటు మెకానికల్ వర్క్, యోగా, ఫస్ట్ ఎయిడ్‌తో పాటు ట్రాఫిక్ నియమ, నిబంధనలు నేర్పనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల అభ్యర్థులు 9963091999, 7382921920 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు

వరి పంట కోతలు ప్రారంభం కావడంతో ధాన్యం సేకరణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. కొనుగోళ్లలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని భావించారు. అందులో భాగంగా ఒక కొత్త రకం యాప్‌ను రూపొందించారు. దీంతో పాటు ప్రభుత్వం అనేక కొత్త మార్పులను తీసుకొచ్చింది. మిల్లుల్లో సిసి కెమెరాలు ఏర్పాటు, విద్యుత్ మీటర్ల రీడింగ్ తీసుకోవడం, ప్రయివేట్ వే బ్రిడ్జిల వినియోగం, తదితర పద్ధతులను కొత్తగా తీసుకొస్తున్న నేపథ్యంలో వీటిని అధిగమించి కొనుగోళ్లు చేయాల్సి ఉన్న తరుణంలో అధికారులు తమ వంతు ఏర్పాట్లు చేస్తున్నారు

- 371 కేంద్రాలు ఏర్పాటు
- 4.38 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం
- సిబ్బందితో యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్న అధికారులు
- రేపటి నుంచి ప్రారంభం?



ప్రజాశక్తి -శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 3,82,550 ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 3,75,518 ఎకరాల మేర ఈ-క్రాప్‌లో నమోదైంది. 8,11,120 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల సొంత అవసరాలు, ఇతర అమ్మకాలు పోను సుమారు 4.38 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అందుకనుగుణంగా సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లకు 371 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే తీసుకుంటామని ప్రభుత్వం సూచించడంతో అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. జిల్లాలో 272 మిల్లులు ఉండగా ఇప్పటివరకు 166 మిల్లుల్లో ఫోర్టిఫైడ్ బియ్యం యంత్ర సామాగ్రి ఉన్నట్లు తెలుస్తోంది. మరో 12 మంది మిల్లర్లు నాన్ సార్టెక్స్ బెండింగ్ మిషన్లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా పౌర సరఫరాల అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. 50 మంది వరకు యంత్ర సామాగ్రి కోసం వేచి చూస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల నాటికి 250 మంది మిల్లర్ల వరకు యంత్ర సామాగ్రిని సమకూర్చుకోగలరని అధికారులు చెప్తున్నారు. ధాన్యం సేకరణకు కోటి వరకు గోనె సంచులు అవసరముంటుందని అధికారులు గుర్తించారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ వద్ద 20లక్షల సంచులు మాత్రమే ఉన్నాయి. రైతులు, మిల్లర్ల వద్ద ఉన్న గోనె సంచులను తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం వినియోగ ఛార్జీల కింద కొంత రుసుమును ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెప్తున్నారు.

సిబ్బంది నియామకం పూర్తి

ధాన్యం సేకరణలో పని చేసే సాంకేతిక సిబ్బందికి సహాయంగా ఈ ఏడాది వాలంటీర్ల సేవలను ప్రభుత్వం నిర్ణయించింది. కళ్లాం నుంచి వే బ్రిడ్జి వరకు కళ్లాల్లో ధాన్యం పరీక్షించిన సమయం, వెయింగ్ బ్రిడ్జి వద్ద తూకం, మిల్లుకు అప్పగింత సందర్భాల్లో కస్టోడియన్ ఆఫీసర్స్ (విఆర్‌ఒలు)తో సమన్వయం చేసుకుని రూట్ అసిస్టెంట్‌గా పని చేయాలి. రూట్ అసిస్టెంట్‌గా వీరిని గుర్తించి విధులు నిర్వహించిన కాలానికి నెలకు రూ.1500 చొప్పున ప్రభుత్వం పారితోషికం చెల్లించనుంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా అధికారులు ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఇద్దరు వాలంటీర్లను నియమించింది. వీరిలో కళ్లాం నుంచి వే బ్రిడ్జి ఒకరు, వే బ్రిడ్జి నుంచి మిల్లు వరకు మరొక వాలంటీరు విధులు నిర్వర్తిస్తారు. ఈ ప్రక్రియ కోసం మొత్తం 1200 మందిని నియమించారు. వీరితో పాటు ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఒక టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు.

ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు



ధాన్యం కొనుగోళ్లకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 371 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. కొనుగోళ్ల ప్రక్రియకు అవసరమైన సిబ్బంది నియామకం పూర్తి చేశాం. బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని మిల్లర్లకు చెప్పడం జరిగింది. కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నాం

-పి.జయంతి,
పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

బ్యాంకు గ్యారంటీ ఇచ్చేదెప్పుడో

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రతి మిల్లరూ ప్రభుత్వానికి బ్యాంకు గ్యారంటీ(బిజి) సమర్పించాల్సి ఉంది. ప్రభుత్వం అందించే ధాన్యం విలువలో తొలుత 33శాతం బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఒక్క మిల్లరు కూడా బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేదు. వారి బిజిలు ఇచ్చిన తర్వాతే అధికారులు మిల్లులకు ధాన్యం పంపుతారు.

ప్రొక్యూర్‌మెంట్ కమిటీలు ఏర్పాటు

ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా మండల స్థాయి ప్రొక్యూర్‌మెంట్ కమిటీల ఏర్పాటు ఇప్పటికే పూర్తయింది. అన్ని మండలాల్లో తహశీల్దార్ అధ్యక్షతన ఎంపిడిఒ, పౌర సరఫరాల డిటి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, అగ్రికల్చర్ అధికారితో కూడిన కమిటీలు ఏర్పాటయ్యాయి.

యాప్ పైనే అంతా టెన్షన్

ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెడుతున్న యాప్ విధానంపైనే అందరిలోనూ టెన్షన్ నెలకొంది. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, వాలంటీర్, టెక్నికల్ అసిస్టెంట్స్, వాలంటీర్ల మొబైల్స్‌లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. యాప్‌లో ధాన్యం పరీక్షించిన ఫోటో, వెయింగ్ బ్రిడ్జి, మిల్లు గేటు వద్ద ఫోటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. యాప్ సరిగా పని చేయకపోయినా, సర్వర్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందులు తలెత్తినా కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. యాప్‌లో అప్‌లోడ్‌కు ఎంత సమయం పడుతుందో, రోజుకు ఎంత మంది వివరాలు నమోదు చేయగలుగుతామో అన్న ఆందోళన వారిని వెంటాడుతోంది.

23న జిల్లాకు సిఎం జగన్ రాక

- పర్యటన తేదీలో మార్పు
- నరసన్నపేట నుంచి రెండో విడత రీ సర్వేకు శ్రీకారం



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 23న జిల్లాలో పర్యటించనున్నారని సమాచారం. నరసన్నపేటలో ఆ రోజు ఉదయం 10గంటలకు జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష(రీ సర్వే) రెండో విడత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఈ నెల 25వ తేదీన ఆయన పర్యటన ఉంటుందని భావించగా రెండు రోజుల ముందుగానే ఆయన జిల్లాలో పర్యటించేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ డిప్యూటీ సిఎం, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నరసన్నపేట కాలేజీ గ్రౌండ్‌లో జరగనున్న ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున జయప్రదం చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కృష్ణదాస్ వివరించారు.

నాలుగో సెమిస్టర్‌ను వాయిదా వేయాలి

రిజిస్ట్రార్‌ను కోరిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పరిధిలో ఉన్న డిగ్రీ విద్యార్థులను వాయిదా వేయాలిన ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజు వర్సిటీ రిజిస్ట్రార్ రాజేంద్ర ప్రసాద్‌ను కోరారు. ఈ నెల 22 నుంచి నాలుగో సెమిస్టర్ పరీక్షలకు షెడ్యూల్ ప్రకటించారని, కానీ ఇప్పటివరకు సిలబస్‌ను పూర్తి చేయలేదని అన్నారు. గురువారం యూనివర్సిటీలో రిజిస్ట్రార్‌ను కలిసి విద్యార్థుల సమస్యను వివరించారు. ప్రస్తుతం ఇంటర్న్‌షిప్ కారణంగా కాలేజీల్లో సిలబస్ పూర్తికాలేదని చెప్పారు. ఈ నెల 19 నుంచి 25 వరకు నేవీ పోటీ పరీక్షలు ఉన్నాయని చెప్పారు. పరీక్షల నిర్వహణకు వారం రోజుల ముందే షెడ్యూల్ ఇవ్వడం వల్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. సిలబస్ పూర్తి కాకుండా పరీక్షలు ఎలా రాస్తామని ప్రశ్నించారు. పరీక్షలపై విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, అందువల్ల పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. స్పందించిన రిజిస్ట్రార్ వర్సిటీ అకడమిక్ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు లిఖిత్, శశి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాజు



పరికరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు విభాగం తనిఖీ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు విభాగాన్ని వార్షిక తనిఖీలో భాగంగా ఎస్‌పి జిఆర్ రాధిక గురువారం పరిశీలించారు. పలు విభాగాల్లో రికార్డుల నిర్వహణ, ఆయుధాలు, వాహనాల పరిస్థితులు, బాంబు డిస్పోసల్, డాగ్ స్క్వాడ్, ఇతర విభాగాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు జాగిలాల ఆరోగ్యం గురించి ఎస్‌పి అరా తీశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీస్ ఆయుధాలు, వాహనాలు మెంటినెన్స్ సక్రమంగా ఉండాలని సూచించారు. పోలీసులు నిత్యం వాడే ఆయుధ పరికరాలు ప్రతి రోజూ శుభ్రం చేసుకోవాలని, వాహనాలు పనితీరును ఎప్పటికప్పుడు చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయుధాలను క్యారీచేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రస్తుత పరిస్థితులను బట్టి వస్తున్న ప్రతి నూతన ఆయుధంపై అవగాహన పెంచుకొని, ఏ విధంగా వాడాలన్న సమాచారం తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. వాహనాలు కండిషన్‌గా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రత్యేకంగా దిశ దర్యాప్తు వాహనాన్ని ఎస్‌పి క్షుణ్ణంగా పరిశీలించినారు. కార్యాలయంలో విభాగాలు పరిసరాలు పరిశ్రుభంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశ్రుభంగా ఉంటేనే ఆహ్లాదకర వాతావరణంలో ఒత్తిడికి లోను కాకుండా విధులు నిర్వహించగలరని, సంక్షేమం దృష్ట్యా, సిబ్బంది సమస్యలు ఏమైనా ఉంటే మా దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి కె.శ్రీనివాసరావు, అర్ఐలు బి.ప్రదీపు, ఉమా మహశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కోన శశిధర్ ఆదేశించారు. జగనన్న భుహక్కు, రీసర్వే నిర్వహణ, జాతీయ ఉపాధి హామీ, స్వచ్ఛ సంకల్పం, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్లాస్టిక్ నిషేధం అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసి గుడ్డ సంచుల వాడకానికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించి పరిశుభ్రతకు తోడ్పాటు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళా సంఘాలు మరింత ఆర్థిక అభివృద్ధి చెంది సుస్థిరమైన ఆదాయం సాధించేలా తోడ్పాటు అందించాలన్నారు. జిల్లాలో జల జీవన్ మిషన్ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతగల భవన నిర్మాణాలు శతశాతం గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సకాలంలో పనులు గ్రౌండింగ్ జరగాలన్నారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న వాటిపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, భూ సర్వే, రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్.లక్ష్మీ ప్రసన్న, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జెసి

ఘనంగా సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మూడు రోజుల పాటు జరగనున్న సైన్స్ కాంగ్రెస్‌కు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల వేదికైంది. గురువారం డిపార్టుమెంట్ ఆఫ్ అప్లైడ్ సైన్స్, జువాలజీ, బొటనీ, కెమికల్‌సైన్సెస్‌పై చర్చ సాగింది. డిబిటి, సొసైటీ ఫర్ బయోటెక్నాలజిస్ట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన జరిగిన సదస్సులో నేటి ఆధునిక తరంలో మెడికల్ బయోటెక్నాలజీలో వచ్చిన అనేక రకాలైన ఆరోగ్యం మెరుగుపరిచే పరిశోధన అంశాలపై చర్చించారు. ప్రొఫెసర్ ఇ.విజయన్, డైరెక్టర్ సిఎస్ఐఆర్ ఎన్ఐఐఎస్‌టి అజయ్ ఘోష్, ఐ.ఐ.ఎస్‌సి బెంగళూరు ప్రొఫెసర్ శేషగిరిరావు కాలానుగుణంగా వస్తున్న మార్పులు ఆధునిక కాలంలో జరుగుతున్న పరిశోధనల ఫలితాలను వివరించారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ పూర్వ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు విద్యుత్ అయస్కాంత వర్ణపటం, వర్ణపట శాస్త్ర పద్ధతులు, ఎలక్ట్రానిక్ వర్ణపట శాస్త్రం, లోహ సంశ్లిష్టాల అధ్యయనం, ఎలక్ట్రానిక్ వర్ణపట శాస్త్రం అనువర్తనాలు గురించి వివరించారు. డాక్టర్ ధానేటి శ్రీధర్ మాట్లాడుతూ ఐవిఎఫ్‌పై ఉత్తమ ప్రదర్శన కనబరిచే వారికి అవార్డులను అందజేస్తానని అన్నారు. సమన్వయ కర్తలుగా డాక్టర్ వై.పోలినాయుడు, హరిత రామారావు వ్యవహరించారు. తొలుత శాస్త్రవేత్తలను అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం.వి.సత్యనారాయణ, ఐక్యూసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ శాంతిదేవి, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, అధ్యాపకులు ప్రమీల, హారతి రవిబాబు, రవీంద్ర రామకష్ణ పాల్గొన్నారు.



శాస్త్రవేత్తలను సత్కరిస్తున్న అధ్యాపకులు

పరిశుభ్రమైన తాగునీరు అవసరం

స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

ఆరోగ్యవంతమైన జీవనానికి పరిశుభ్రమైన తాగునీరు అవసరమని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో రూ.2 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. షలంత్రి గ్రామంలో రూ.70లక్షలతో, బురిటివలస గ్రామంలో రూ.70 లక్షలతో, మర్రిపాడులో రూ.55లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయి కార్యక్రమానికి స్పీకర్ సీతారం శంకుస్థాపన చేశారు. బురిడీవలస గ్రామస్తులు శ్మశానానికి వెళ్లడానికి రోడ్డు లేదని, మండల పరిషత్ పాఠశాల చుట్టూ రక్షణ గోడ లేదని స్పీకర్ తమ్మినేని సీతారాంకు వినతిపత్రం సమర్పించారు. స్పీకర్ స్పందిస్తూ పనులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి కెవిజి.సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెవరు మల్లేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కోయిలాపు చంద్రశేఖర్, వైస్ ఎంపిపి అనిల్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్రి రామారావు, బూత్ కమిటీ కన్వీనర్ ముడడ్ల రమణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న తమ్మినేని సీతారాం

వికేంద్రీకరణకే ప్రజల మద్దతు

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రాష్ట్ర ప్రజలంతా పాలనా వికేంద్రీకరణనే కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. జెఎసి టెక్కలి నియోజకవర్గం, ఎపి నిరుద్యోగ పోరాట సంఘం ఆధ్వర్యాన గురువారం టెక్కలి డిగ్రీ కళాశాల నుండి ఇందిరాగాంధీ జంక్షన్ మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వాడ మాట్లాడుతూ విశాఖ పాలనా రాజధాని కావాల్సిన అవసరం ఉత్తరాంధ్ర జిల్లాలకే ఎక్కువగా ఉందన్నారు. ఈ రాష్ట్రానికి శాశ్వత రాజధానినే లేకుండా చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. ఎపి విభజన చట్టంలో పదేళ్ల రాజధానిగా హైదరాబాద్ ఉండగా, అది వదిలేసి చంద్రబాబు మూడు నెలల్లో వచ్చేసారని. శివరామకృష్ణ కమిటీ పెద్ద క్యాపిటల్ వద్దని సలహా ఇస్తే.. చంద్రబాబు తాబేదారులు చెప్పే విజయవాడ- గుంటూరులో అసలు రాజధానే వద్దన్నారని గుర్తు చేశారు. దేశంలో చాలా రాష్ట్రాల్లో హైకోర్టు ఒక దగ్గర, పరిపాలనా రాజధాని ఒకదగ్గర ఉన్నాయని అలాంటప్పుడు రాష్ట్రంలో మూడు రాజధానులుంటే ఇబ్బంది ఏమిటన్నారు. చంద్రబాబుకి ఒక్క రియల్ ఎస్టేట్ తప్ప ఏమీ పట్టదన్నారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక పెద్ద పట్టణం విశాఖ అని.. రాజధానికి అవకాశం ఉందన్నారు. భావనపాడు పోర్టుతో నిరుద్యోగ సమస్య తీరుతుందని, టెక్కలి పారిశ్రామిక వాడగా మారుతుందున్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జెఎసి చైర్మన్ గుంట తులసీరావు, జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి ఎంపిపి అట్లా సరోజనమ్మ, సర్పంచ్ గొండెలి సుజాత, మహిళా విభాగం అధ్యక్షురాలు అట్లా జరోజనమ్మ చింతాడ మంజుగణపతి, మహిళా విభాగం మండల అధ్యక్షులు అట్లా దివ్వెల మాధురి, వారణాసి గోవిందరావు, బమ్మిడి తులసిరావు ,బగాది హరి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జెఎసి నాయకులు డి.ఎ.స్టాలిన్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న దువ్వాడ శ్రీనివాస్, నాయకులు

అధిక ధరలతో పేదలను బాదేస్తున్నారు

ఎంపీ రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - ఆమదాలవలస

వైసిపి ప్రభుత్వం అధిక ధరలతో పేదలను బాదేస్తోందని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. గురువారం మండలంలోని కొర్లకోట గ్రామంలో నిర్వహించిన బాదుడే బాదుడులో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌తో కలిసి ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ నిత్యవసరాల ధరలు దిగి రావాలంటే జగన్మోహన్‌రెడ్డి దిగిపోవాలని అన్నారు. నాసిరకమైన మద్యాన్ని అధిక ధరలకు అమ్ముతూ ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తూ ఖజానాను నింపుకుంటున్నారని విమర్శించారు. చెత్తపై, నీటిపై, వృత్తులపై పన్నులతో పాటు, గ్రీన్ టాక్స్, పోల్‌టాక్స్,రిజిస్ట్రేషన్ ఛార్జీలు అంటూ పన్నుల రూపంలో ప్రజలపై మోయలేని భారాలు వేస్తూ పీల్చి పిప్పి చేస్తున్నారని ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూన రవికుమార్ మాట్లాడుతూ టిడిపి పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడకుండా ధరలన్నీ అందుబాటులో ఉండేలా పాలన చేశామని, నేడు నేడు ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ మూడున్నరేళ్లలో ఏకంగా ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి, రూ.16,611 కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన వేశారని మండిపడ్డారు. విద్యుత్ సంస్థలను తనఖాపెట్టి 26,261 కోట్ల రూపాయలను అప్పుతెచ్చి దారి మళ్లించారని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి హయంలో ఉచితంగా ఇసుక అందేదని, అటువంటి పథకాన్ని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దుచేసి శాండ్ పాలసి పేరుతో ఇసుకకు ధరను నిర్ణయించి గతంలో రూ.800 ఉన్న ట్రాక్టర్ లోడు ఇసుకను రూ.5వేలకు పెంచేశారని, ఇదేనా సంక్షేమ పాలన అని ప్రశ్నించారు. సిమెంటు ధరను సిండికేట్‌గా మారి అధిక ధరలకు పెంచారని, గతంలో టన్ను ఇనుము రూ.45 వేలు ఉంటే నేడు రూ.78వేలకు చేరుకుందని, పేదవాడి సొంత ఇంటి కల నెరవేరకుండా ఈ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పెట్రోల్, డీజిల్ ధరలపై వ్యాట్, సెస్‌ల పేరుతో అధిక పన్నులను వేసి ప్రతి లీటరుపైనా అదనంగా రూ.5 వసూలు చేస్తూ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల దగ్గర ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేస్తున్నదా? అని రైతు పేడాడ శ్యామలరావును రవికుమార్ ప్రశ్నించారు.

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్దతుధర కంటే తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, మండల అధ్యక్షుడు నూకరాజు, మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షులు మెట్ట సుజాత, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, చీమలవలస, కొర్లకోట సర్పంచ్‌లు సనపల చెల్లంనాయుడు, సనపల అన్నపూర్ణమ్మ, గొండు రమణ, చేపేన సత్తిరాజు, పైడి లక్ష్మి, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వృద్ధునితో మాట్లాడుతున్న రవికుమార్, ఎంపీ


లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైఎస్ఆర్ జగనన్న కాలనీ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కోరారు. పురపాలక సంఘ పరిధిలోని 15వ వార్డులోని కొత్తకోటవారి వీధి, 14వ వార్డు పరిధిలోని ఐ.జె.నాయుడు కాలనీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరత్నాల సంక్షేమ పథకాలతో పేదల బతుకుల్లో ఆశలు నింపిన జగన్ రాజకీయ చతురత మంత్రముగ్ధులను చేస్తోందన్నారు. ఇదే ఒరవడితో ముందుకు సాగుతున్నారు. మన బడి నాడు-నేడు కార్యక్రమంతో విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చామన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీతో నిరుపేదల జీవితాల్లో ఆపద్బాంధవుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్, ఎఇ కె.అప్పలనాయుడు, వైసిపి నాయకులు పి.శ్రీనివాసరావు, ఎ.ఉమామహేశ్వరరావు, బి.అజంతాకుమారి, బి.చిన్నంనాయుడు, బి.వి.రమణమూర్తి, ఎం.ఈశ్వరమ్మ, బి.రవి, డి.శ్యామలరావు, కె.శ్యాంప్రసాదరావు, ఎస్.మల్లికార్జునరావు, ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కళావెంకటరావు

మాయల ప్రభుత్వాన్ని నమ్మొద్దు

మాజీ మంత్రి కళావెంకటరావు

ప్రజాశక్తి- లావేరు

మాయల ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలు నమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలంలోని గుర్రాలపాలెంలో గురువారం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో నిత్యావసరాల అధిక ధరలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ప్రజలను మాయమాటలు చెప్పి వంచించారన్నారు. అధికారం చెపట్టిన మూడేళ్లలోనే రాష్ట్రాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. ఉద్యోగులను, నిరుద్యోగులను, విద్యార్థులను, రైతులను, కార్మికులను అన్ని విధాలా మోసం చేసి నష్టపెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, కార్యదర్శి పి.మధుబాబు, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, ఎం.సోంబాబు, ఆర్.ప్రకాశరావు, పెద్దకొత్తపల్లి సర్పంచ్ ఆరేళ్ల కృష్ణ, కె.రమణబాబు పాల్గొన్నారు.

పొందూరు ఆదర్శ పాఠశాలలో దాహం కేకలు

- 620 మంది విద్యార్థులకు ఒక్కటే బోరు
- కాలకృత్యాలకు బయటకు వెళ్తుండటంతో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి- పొందూరు

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్ని సదుపాయాలు, వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, వారి సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామంటూ ప్రభుత్వాలు పదేపదే చెబుతున్నాయి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యాన ఏర్పాటు చేసి ఆదర్శ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పొందూరు మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో సరిపడా నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు దాహంతో అల్లాడిపోతున్నారు. ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ 620 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ తాగునీటి కోసం ఒక్కటే మోటారు బోరు ఉండడంతో సరిపడా నీరు రావడం లేదు.


పొందూరు ఆదర్శ పాఠశాల

పాఠశాలలో సుమారు 620 మంది విద్యార్థులు ఉండగా వీరందరికీ ఒక్కటే తాగునీటి మోటారు బోరు ఉంది. పాఠశాల పక్కనే విద్యార్థినుల వసతి గృహం ఉండగా, అక్కడ ఉన్న తాగునీటి బోరును గతేడాది రహదారి నిర్మాణ పనుల్లో ప్రొక్లెయినర్‌తో తవ్వేయడంతో పాడైపోయింది. అప్పటి నుంచి పాఠశాల నుంచే వసతి గృహానికి నీరు సరఫరా చేస్తున్నారు. చాలీచాలని నీటితో వసతి గృహంలోని విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. దీనిపై పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం...

పాఠశాలలో సరిపడా నీరు లేకపోవడంతో పలువురు విద్యార్థులు కాలకృత్యాలకు, భోజనం ప్లేట్లు శుభ్రం


చెరువులో ప్లేట్లు శుభ్రం చేస్తున్న విద్యార్థులు

చేసుకునేందుకు సమీపంలో గల రాతిగుమ్మలు, చెరువులకు వెళ్తుండడంతో తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. ఇలా బయటకు వెళ్లినప్పుడు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులు బయటకు వెళ్తున్నా చూసిచూడనట్టుగా ఉపాధ్యాయులు పట్టించుకోవడం లేదంటూ పలువురు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో సరిపడా నీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు. దీనిపై ప్రిన్సిపాల్ ప్రభాకరరావు మాట్లాడుతూ పాఠశాలలో నీటి సమస్యపై జిల్లా అధికారులకు నివేదించామన్నారు. విద్యార్థులు బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

శ్రీకాకుళం అర్బన్ : యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన చైల్డ్ లైన్ కొలాబ్ ప్రాజెక్టు నిర్వహిస్తున్న చైల్డ్‌లైన్ సే దోస్తీ, బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఎచ్చెర్ల మండలం దుప్పలవలసలో ఎపిఆర్‌జెసిలో విద్యార్థులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు, యూత్ క్లబ్ కోశాధికారి అప్పలనాయుడులు ప్రారంభించారు. ఎంతో ఉత్సాహంగా కబడ్డీ, వాలీబాల్ తదితర క్రీడాలు పోటీలు నిర్వహించారు. డిసిఒ జి.గ్రేషి మాట్లాడుతూ బాల్యాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

సమాజంపై ఉందని అన్నారు. బాల్య వివాహాలపైన, బాలకార్మిక చట్టాలపైన ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. యూత్ క్లబ్ బెజ్జిపురం, చైల్డ్‌లైన్ కొలాబ్ ప్రాజెక్టు ట్రెజరర్ జి.అప్పలనాయుడు చైల్డ్‌లైన్ సే దోస్తీ వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. బాలలను అభివృద్ధి మార్గంలో నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. వారిలో క్రమశిక్షణ, మంచి అలవాట్లు సమాజానికి మేలు చేస్తాయన్నారు. 0 నుంచి 18లోపు బాలలు ఎటువంటి ఆపదలో ఉన్నా చైల్డ్‌లైన్ టోల్ ఫ్రీ నంబరు 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యుడు ఎం.గన్నప్పుడు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఎఎస్ఐ డి.రమణమూర్తి, ప్రోగ్రాం మేనేజర్ పెంకి బాలకృష్ణ, రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ పి.హేమలత, చైల్డ్‌లైన్ టీమ్ మెంబర్స్ డి.మౌనిక, వై.శంకరరావు, బి.సంతోషి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష

టిడిపి పూర్వ వైభవానికి కృషి

మందస: వచ్చే ఎన్నికల్లో టిడిపి పూర్వ వైభవానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పిలుపునిచ్చారు. మందస మండలం మందస టౌన్, సిరిపురం, పితాతోలి దున్నవూరు, అంబుగాం, హరిపురం, కొంకడపుట్టి, కొండలోగం, మకరజోల, బాహడపల్లి గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఆయా ప్రాంతాల యూనిట్ ఇన్‌ఛార్జిలతో, క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ జాబితాను సక్రమంగా పరిశీలించారు. తెలుగుదేశం పార్టీకి సంబంధించిన ఓటర్లను తొలగించినట్లయితే నిజనిర్ధారణ చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భావన దుర్యోధన, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు దాసరి తాతారావు, తమిరి భాస్కరరావు, బమ్మిడి కర్రెయ్య, యూనిట్ ఇన్‌ఛార్జిలు డొంకురు తిరుపతి, రాజాన మహేష్, సవర లఖ్య, సాలిన మాధవరావు, చౌదరి మురళీకృష్ణ, భైరిశెట్టి గున్నయ్య, తమ్మినేని ధనుంజయ, ముడిమించి నవీన్ పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

నందిగాం : ప్రభుత్వం 50 శాతంతో అందజేస్తున్న సోడి, సన్‌హంప్ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని లఖదాసుపురం సర్పంచ్ బొంగి మోహనరావు గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై సోడి విత్తనాలు అందిస్తున్నట్లు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ పి.వాసవి తెలిపారు. అవసరమైన రైతులు తనను సంప్రదిస్తే విత్తనాలను అందజేస్తామని తెలిపారు.


విత్తనాలను అందజేస్తున్న సర్పంచ్ మోహనరావు

అంగన్వాడీ కార్యకర్త తొలగింపు

ప్రజాశక్తి- ఆమదాలవలస


మండలంలోని నెల్లిపర్తి-1 అంగన్వాడీ కార్యకర్త జి.పద్మను విధుల నుంచి తొలగించినట్లు సమగ్ర శిశుఅభివృద్ధి అధికారి కె.వి.బాలామణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అంగన్వాడీ సూపర్‌వైజర్ కె.లీలారాణి నెల్లిపర్తిలోని అంగన్వాడీ -1 సెంటర్‌కు వెళ్లి జి.పద్మను తొలగించినట్లు ఉత్తర్వులను గురువారం గోడకు అంటించారు. అనంతరం విధులపై నిర్లక్ష్యం వహించిన కారణంగా తొలగించినట్లు పిఒ తెలియజేయమని తెలిపారని సూపర్‌వైజర్ కార్యకర్తకు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే... గతేడాది అక్టోబరు 25న మాజీ సర్పంచ్ మానుకొండ వెంకటరమణ కార్యకర్త పద్మపై అధికారులకు ఫిర్యాదు చేశారు. 2019 ఎన్నికల్లో నెల్లిపర్తిలో 2021లో నిర్వహించిన ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లోనూ టిడిపి తరుపున ఇంటింటికీ వెళ్లి తరపున ప్రసారం చేశారని, ఆమదాలవలస పట్టణంలోని చంద్రయ్యపేటలో నివాసం ఉంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు కార్యకర్త జి.పద్మను సంజాయిషీ కోరగా సరైన సమయానికి సంజాయిషీ సమర్పించలేదని, విధులపై నిర్లక్ష్యం వహించిన కారణం, గడువు తేదీలోగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో విధుల నుంచి తొలగించేందుకు నియామక కమిటీ ఆమోదం మేరకు ఉద్యోగం నుంచి తొలగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, గ్రామ పెద్ద వెంకటరమణలోని ప్రజలను కానీ, అంగన్వాడీ లబ్ధిదారులకు కానీ ఎటువంటి విచారణ చేయకుండా ఏకపక్షంగా రాజకీయ ఒత్తిడి మేరకు తొలగించడం ఎంత వరకు సమంజసమని సూపర్‌వైజర్ కె.లీలారా ణిని కార్యకర్త పద్మ ప్రశ్నించారు. వైసిపి సర్పంచ్ భర్త ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం ఏమిటని గ్రామస్తులు సూపర్‌వైజర్‌ను నిలదీశారు. అదే గ్రామంలోని నెల్లిపర్తి సెంటర్-2 అంగన్వాడీ కార్యకర్తను ఛార్జి మెమోను తీసుకోమని సూపర్‌ఎైజర్ కోరగా, తాను అనారోగ్యంతో బాధపడుతు న్నానని, తాను విధులను నిర్వహించలేనని కార్యకర్త తెలిపారు. అదే పంచాయతీకి చెందిన గొల్లపేట సెంటర్ కార్యకర్తను ఛార్జి మెమో తీసుకోమని కోరగా, ఆమె కూడా నిరాకరించారు. ఉన్నతాధికారులు ఆదేశించిన పనిని తాను నిర్వర్తించానని, ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని సూపర్‌వైజర్ బదులిస్తూ అక్కడి నుంచి వెనుతిరిగారు.


నోటీసు అంటిస్తున్న సూపర్‌వైజర్ లీలారాణి

'ఐతమ్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

శ్రీకాకుళం సెట్‌శ్రీ ఆధ్వర్యాన గురజాడ కాలేజీలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజన పోటీల్లో టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. పలు పోటీల్లో 35 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో 22 మంది ప్రథమ, ద్వితీయ స్థాయి బహుమతులను గెలుపొందారు. గురువారం ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు. ఎన్.ప్రవీణ్ నేతృత్వంలో వక్తృత్వ, గ్రూప్ డిస్కషన్ పోటీల్లో ప్రథమం, మోడరన్ డ్యాన్స్‌కు నేతృత్వం వహించిన సాయిభగవత్ బృందం ద్వితీయ బహుమతి సాధించారు. పోటీల న్యాయ నిర్ణేతగా పాల్గొన్న డాక్టర్ డి.విష్ణుమూర్తి, శాక్ కో-ఆర్డినేటర్ జె.సురేష్‌కుమార్‌లు విద్యార్థులను అభినందించారు.


అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

కవిటి...

కవిటి : కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ పూడి లక్ష్మణరావు అభినందించారు. జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీకాకుళంలో నిర్వహించిన పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి యువజనోత్సవ పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యార్థులకు, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయునికి పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ జానపద బృంద నృత్యం, కర్ణాటక సంగీతం, గాత్రం, హార్మోనియం, మోడ్రన్ డ్యాన్స్ విభాగాల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సంపాదించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. అదే విధంగా జానపద బృంద గీతం, మృదంగం విభాగాల్లో ద్వితీయ స్థానం సంపాదించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ ఎం.కృష్ణారావు, ఉపాధ్యాయులు ఎన్.విశ్వనాథం, బి.జానకిరావు, కె.జానకిరావు, గోవింద చంద్రపాధి, ఎస్.వి.రమణ, టి.రాధిక, జె.గణపతి, పి.లక్ష్మి పాల్గొన్నారు.

పెద్దమడి...

మెళియాపుట్టి : మండలంలోని పెద్దమడి గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభసాధించారు. శ్రీకాకుళంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించారు. జావలిన్ త్రోలో ఇంటర్ రెండో సంవత్సరానికి చెందిన విద్యార్థి జి.విద్యాశేఖర్ ప్రథమ స్థానం గెలుపొందారు. లాంగ్ జంప్‌లో ఎస్.జాస్మిన్ ప్రథమ స్థానం, కె.అభిషేక్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. కె.అభిషేక్ ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం సాధించాడు. ట్రిపుల్ జంప్‌లో ఎస్.నితిన్ చక్రవర్తి ద్వితీయ స్థానాన్ని సాధించాడు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపల్ రేణుకేశ్వరరావు, అధ్యాపకులు అభినందించారు.


మెళియాపుట్టి : అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రేణుకేశ్వరరావు


అలరించిన కవి సమ్మేళనం


ప్రశంసాపత్రాలు అందుకున్న కవులు

శ్రీకాకుళం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా గురువారం చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అధ్యక్షతన కవితా దినోత్సవం సందర్భంగా కవితా సమ్మేళనాలు రచనలు సందేహాలు గురువారం నిర్వహించారు. వయోజన విద్య డైరెక్టర్ ముద్దాడ వెంకటరమణ, గాయత్రి కాలేజ్ ప్రిన్సిపాల్ పులకండం శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కవి సమ్మేళనంలో కవులు మహమ్మద్ రఫీ, ఆర్.వి. రమణమూర్తి, భోగిల ఉమామహేశ్వరరావు, కిమ్మి సంతోష్‌కుమార్, దుర్గా ప్రసాద్, ఐఎన్‌డి ప్రసాద్, ఉత్తరవెల్లి నాగేశ్వరరావు, చోడవరం ఈశ్వరరావు, శ్రీనివాస్, పి.వి.ఎస్.ప్రసాద్, కె.వాసవి, బాలభారతి, పత్తి సుమతి, నీలకంఠంలను సన్మానించి మెమొంటోలను అందజేశారు. కవులు తమ మనసులో ఉన్న భావాలను కవితల రూపంలో విద్యార్థులకు వినిపించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ప్రతినిధి సువారి సత్యనారాయణ, కార్యదర్శి బి.కుమార్‌రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాజన సభను విజయవంతం చేయాలి

శ్రీకాకుళం: ఈనెల 27న విజయవాడలో నిర్వహించనున్న గ్రామ, వార్డు, సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ మొదటి మహాజన సభను జయప్రదం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు శ్రీరాములు కోరారు. గురువారం రెవెన్యూ అతిథి గృహంలో మొదటి మహాజన సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన మొదటి మహాజన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ డిటి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ఎపి ఎస్ఎస్ఎ ప్రెసిడెంట్ సుధాకర్, సచివాలయ రాష్ట్ర అడక్ వైస్ ప్రెసిడెంట్ సీపాన గోవిందు, జిల్లా అధ్యక్షులు రఘుపాత్రుని పాణిగ్రాహి, జిల్లా ట్రెజరర్ జామి, జాయింట్ సెక్రటరీ నరసింహ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేణుగోపాల్, శ్రీరాములు

విద్యుత్ వాహనాల వాడకం మరింత సులభం



డికె బ్యాటరీ షోరూం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పెట్రో ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించుకోవడంతో పాటు వాతావరణంలో కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో సాకేంతికంగా మార్పులు చేస్తూ ద్విచక్ర వాహనాలను కనుగొన్నారు. అందులో భాగంగా ప్రత్యామ్నాయ ద్విచక్ర వాహనాలు ఇప్పటికే మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చాయి. నైపుణ్యం సాంకేతికతలను అందిపుచ్చుకున్న తయారీదారులు వినూత్నమైన మోడల్స్‌ను మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. శ్రీకాకుళంలోనూ ఇప్పుడు ప్రత్యామ్నాయ ద్విచక్ర వాహనాలు అందుబాటులో ఉన్నాయని డికె మోటార్స్ అధినేత, బ్యాటరీ ద్విచక్ర వాహన కంపెనీ డీలర్ కె.నరేష్‌కుమార్ తెలిపారు. బ్యాటరీలతో నడిచే మూడు మోడల్స్ డికె మోటార్స్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాలు ఒక రకమైతే... రెండింటికీ ఎటువంటి లైసెన్సు పొందనక్కర్లేదని, రిజిస్ట్రేషన్ కూడా అవసరం లేదని వివరించారు. శత శాతం కాలుష్య రహితంగా నడిచే ఈ వాహనాలు డిస్క్ బ్రేకులు, రెండు గంటల్లోనే ఛార్జింగ్ పూర్తయ్యే చార్జర్లు యూఎస్బీ పోర్ట్స్, అందమైన ఎల్ఇడి వెలుగులు, రిమోట్ కంట్రోల్ కీ తదితర అనేక సౌకర్యాలు, మంచి మైలేజీ, అతితక్కువ శబ్దంతో ప్రయాణం చేసుకునే వీలుందన్నారు. ఇటువంటి అంశాలు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఏడాది కాలంగా వినియోగదారులకు నిరంతరం ఈ వాహనాలపై అవగాహన కల్పించడంతో పాటు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని చెప్పారు. వాయు కాలుష్యం, శబ్దకాలుష్యం తగ్గిన వాహనాలతో రహదారులపై ప్రయాణం సుఖంగా ఉంటుందని వివరించారు. వినియోగదారులు అవగాహన పెంచుకుని ఈ వాహనాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

మంచినీళ్లపేటలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని మంచినీళ్లపేటలో గురువారం తిత్తి లక్ష్మి ఇంట్లో సంభవించిన అగ్నిప్రమాదంలో రూ. 5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితురాలు లబోదిబోమంటుంది. వివరాల్లోకి వెళ్తే లక్ష్మి భర్త దాసు ముంబాయిలో వలస కూలీగా ఉన్నాడు. అత్త సింగమ్మతో కలిసి గుళ్లవీధిలో అద్దె ఇంటిలో ఉంటున్నారు. గురువారం ఇంటికి తాళం వేసి అత్తను ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారు వెళ్లిన కొద్ది సమయానికి ఇంటి నుంచి పొగలు రావడంతో ఇరుగుపొరుగు వారు లక్ష్మికి కబురు పెట్టి తాళాలు పగలగొట్టి చూడగా ఇంట్లో సామానులు కాలి బూడిదైంది. ఇంటి నిర్మాణం కోసం దాచిన రూ.లక్ష, ఐదు తులాల బంగారం, దుస్తులు కాలిపోయాయి. కాలిన నగదు, సామగ్రి చూసిన లక్ష్మి బోరున విలపించింది. మాజీ సర్పంచ్ గుళ్ల చిన్నారావు ఫిర్యాదు మేరకు ఆర్ఐ పవిత్ర, విఆర్ఒ మోహనరావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. దేవుని పటం వద్ద దీపం అంటుకొని ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

నడసంద్రలో మూడు పశువుల శాలలు...

మెళియాపుట్టి: మండలంలోని నడసంద్రలో బుధవారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో భాస్కర్ మజ్జి, ప్రశాంత్ మజ్జి, బిట్టు మజ్జిలకు చెందిన పశువుల శాలలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో నాలుగు పశువులకు గాయాలయ్యాయి. అందరూ నిద్రిస్తున్న సమయంలో శాలల నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. శాలల్లోని పశువులను రక్షించారు. అనంతరం మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.75 వేలు ఆస్తినష్టం ఉంటుందని బాధితులు తెలిపారు. గాయపడిన పశువులకు గురువారం పశువైద్య సిబ్బంది చికిత్స అందించారు. రెవెన్యూ సిబ్బంది పరిశీలించి నష్టం అంచనా వేశారు.


వజ్రపుకొత్తూరు : కాలిపోయిన నగదు


క్రైమ్ కార్నర్


రామారావు మృతదేహం

బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పద్మనాభపురం కాలనీలో నివాసం ఉంటున్న దుంప రామారావు (73) గురువారం వేకువజామున ఇంటికి సమీపంలో ఉన్న బావిలో పడి మృతి చెందారు. బుధవారం రాత్రి మృతుడు కోడలు ఇంట్లో వేసిన ముగ్గును కాళ్లతో మట్టేశారని కోపం పడడంతో మనస్తాపం చెందిన రామారావు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి కనిపించకపోవడంతో సమీప ప్రాంతంలో వెతకగా ఇంటికి సమీపంలో ఉన్న బావిలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. విషయాన్ని కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ గవరయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గోపాల్ హంసద మృతదేహం
(ఇన్‌సెట్‌లో గోపాల్ హంసద (ఫైల్))

గ్రానైట్ కార్మికుడు దుర్మరణం

మెళియాపుట్టి: మండలంలోని దీనబంధుపురం వద్ద భవాని గ్రానైట్ కంపెనీలో మిషన్ హెల్పర్‌గా పనిచేస్తున్న గోపాల్ హంసద (21) ప్రమాదానికి గురై గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బసంత్‌పూర్‌కు చెందిన గోపాల్ ఉపాధి నిమిత్తం మూడు నెలల కిందట మిషన్ హెల్పర్‌గా గ్రానైట్ కంపెనీలో చేరాడు. స్టోన్ శ్లాబ్‌ను మరొక ట్రాలీకి ఎక్కించే సమయంలో జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే టెక్కలి ప్రభుత్వాస్పత్రికి వైద్యం నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించి మృతి చెందారు. మృతుడు చిన్నాన్న కుమారుడు శుభ్రతో కుమార్ మహంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

కొత్తూరు : మండలంలోని పారాపురం వద్ద గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. మెట్టూరు బిట్-2 నుంచి ద్విచక్ర వాహనంపై పతివాడ తిరుపతిరావు, ప్రమీల, మజ్జి పవిత్ర కొత్తూరు వస్తున్నారు. శ్రీకాకుళం నుంచి కొత్తూరు వెళ్తున్న కారు పారాపురంలోని ఓ దాభా వద్ద బైక్‌ను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ప్రమీల తలకు గాయమైంది. పవిత్రకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఎస్ఐ గోవింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధితో మహిళ మృతి

పలాస : మండలంలోని బొడ్డుపాడుకు చెందిన బొడ్డు ఈశ్వరమ్మ (55) గురువారం కిడ్నీ వ్యాధితో మృతి చెందింది. మూడు నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడు తూ ఉండేది. ఆమెకు వివాహం కాకపోవడంతో ఆమె బంధువులు బాగోగులను చూసేవారు.


పీర్లకొండను సందర్శించిన విద్యార్థులు

పీర్లకొండ మత సామరస్యానికి ప్రతీక

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం పట్టణంలోని పీర్లకొండ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని స్వర్ణభారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి అన్నారు. తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థినీ విద్యార్థులకు గురువారం పీర్లకొండ సందర్శనకు తీసుకెళ్లామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పీర్లకొండ చరిత్ర వివరించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మతాలకు అతీతంగా అన్ని తరగతి ప్రజలు ఈ పీర్లకొండ యాత్రకు ఏటా క్రమం తప్పకుండా యాత్రికులు వస్తారని అన్నారు. కార్యక్రమంలో విద్యా సంస్థల కో-ఆర్డినేటర్ చాట్ల నిలిమారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ జానకిరావు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

కవిటి: పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాజపురం సర్పంచ్ సనపల జానకిరావు తెలిపారు. మండలంలోని రాజపురం పంచాయతీ చండిపుట్టుగలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకవర్గం కొలువుతీరిన తరువాత పంచాయతీలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సభ్యుడు ఎన్ని అశోక్, అప్పలస్వామి, రంజిత్, మనోజ్, రాజేష్, నరసింహమూర్తి, కిరణ్, బొర్ర శేషగిరి పాల్గొన్నారు.

భాస్కరరావుకు సన్మానం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఎల్ఐసి శాటిలైట్ బ్రాంచ్‌లో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నల్లనా భాస్కరరావు సోంపేటకు ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు కార్యాలయంలో సిబ్బంది గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఆరేళ్ల పాటు ఇన్‌ఛార్జి మేనేజర్‌గా సేవలందించారు. బ్రాంచ్ మేనేజర్ ఎం.ఎస్.మూర్తి, కాళ్ల జగదీష్, కె.వాసుదేవ్, సీనియర్ డిఒ పాత్రో, ఏజెంట్లు తిరుపతిరావు, ధర్మరాజు, బుజ్జి, శ్రీను, చిన్నారావు పాల్గొన్నారు.



పంటకోత ప్రయోగం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కోష్టలో పంటకోత ప్రయోగం

ప్రజాశక్తి- రణస్థలం

నవధాన్యాలు వేసి ప్రకృతి వ్యవసాయం చేసే అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబవు కృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని కోష్టలో గురువారం వరిలో పంటకోత ప్రయోగాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పంట కూత ప్రయోగాలను రసాయన వ్యవసాయ పద్ధతిలో చేసే రైతుకు 5x5 మీటర్లలో దిగుబడి 11.900 గ్రాములు దిగుబడి వచ్చిందన్నారు. అంటే ఎకరాకు దిగుబడి 19.27 క్వింటాలు వచ్చిందన్నారు. వరి వేసే ముందు నవధాన్యాలను వేయాలన్నారు. నల్లి ఐదు రోజుల తర్వాత పశువుల మేతగా ఉపయోగించుకుని, మిగతా వాటిని భూమిలో కలయదున్నారని తెలిపారు. వరి నారి నాటుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చునని పేర్కొన్నారు. అలాగే నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చునని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది హేమలత, పెద్దింటి రాజేశ్వరి, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు ప్రమీల, జ్యోతి, భారతి, సంతోష్ పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న శ్రీనాథస్వామి

మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రస్తుత తరుణంలో వ్యవసాయంలో ఎదురవుతున్న పలు సవాళ్లను వ్యూహాత్మకంగా ఎదుర్కొనేందుకు మేలైన యాజమాన్య పద్ధతులు ఆచరించాలని అవసరం ఉందని జిల్లా రిసోర్స్ సెంటర్ వ్యవసాయ ఉపసంచాలకులు కె.శ్రీనాథస్వామి అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో మెళియాపుట్టి, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులకు, గ్రామ వ్యవసాయ సహాయకులకు, గ్రామ ఉద్యాన సహాయకులకు గురువారం శిక్షణ ఇచ్చారు. మేలైన యాజమాన్య పద్ధతులు ఆచరించడం వల్ల రైతులకు, వినియోగదారులకు కలిగే ప్రయోజనాలపై కూలంకషంగా చర్చించి శిక్షణ ఇచ్చారు. రబీ పంటలైన పెసర, మినుము, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటల విత్తనాల లభ్యత అనుకూల విత్తన రకాలు, రబీలో నిర్వహించాల్సిన పొలంబడులు ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం క్లస్టర్లు, బీడీపీలు, ఇతర యాజమాన్య పద్ధతులపై గ్రామ జిల్లా రిసోర్స్ సెంటర్ సహాయ సంచాలకులు సిహెచ్.వెంకటరావు, ఏ.సూర్యకుమారి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఒలు దానకర్ణుడు, పోలారావు, కిరణ్మయి, శిరీష్ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న రామ్మోహనరావు

దళితులకు జనసేన అండ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని బైరిశాస్త్రులపేటలో పెత్తందారుల దాడిలో గాయపడిన దళిత మహిళ బందారు మంజును జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పేడాడ రామ్మోహనరావు గురువారం పరామర్శించారు. ఇటీవల భూతగాదాలు నేపథ్యంలో గాజులకొల్లివలస అధికార పార్టీ నేత మెండేటి కూర్మారావు దళిత మహిళపై కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. జనసేన పార్టీ అండగా ఉంటుందని ఆమెకు ధైర్యం చెప్పారు. అలాగే దాడికి కారణమైన దోషులను వెంటనే శిక్షించి, బాధితులకు రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు. అలాగే దళితులపై ఎన్నో చట్టాలు చేసినప్పటికీ అధికార పార్టీ నాయకుల అండదండలతో తరచూ పెత్తందారులు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. దళితులకు అండగా ఉంటాం అని ప్రసంగాలతో ఊదరగొడుతున్న అధికార పార్టీ ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఆయనతోపాటు జన సైనికులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రంథాలయాల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు



పోలాకి : వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

లావేరు మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయం ఆధ్వర్యాన నిర్వహించి జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో కెజిబివి పాఠశాల పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.సుధ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో ప్రతి విద్యార్థీ భాగస్వాములు కావాలన్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలు ఇంటికి తీసుకుని వెళ్లడానికి ధరావత్తు చెల్లించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, కెజిబివి ఉపాధ్యాయులు టి.శాంతి, టి.సుమంజలి, వి.కవితప్రియా, గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలో 30 మంది విద్యార్థులు డ్రాయింగ్‌లోని, 40 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు.

రణస్థలం శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీలో 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ త్రినాథరావు, గ్రంథాలయాధికారి పి.వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జి.సిగడాం శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వై.అమర్నాథ్ ఆధ్వర్యాన 6,7,8 వ తరగతులకు గ్రంథాలయాల ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజిబివి, మోడల్ స్కూల్ విద్యార్థులు వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, ఈశ్వరరావు, రాము, సిబ్బంది దుర్గారావు పాల్గొన్నారు.

పొందూరు గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.వి.భాస్కరరావు ఆధ్వర్యాన నిర్వహించిన పర్యావరణ పరిరక్షణ అనే అంశంపూ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ, మానసవేణి పాఠశాలల విద్యార్థులు 40 మంది పాల్గొన్నారు.

కోటబొమ్మాళి గ్రంథాలయంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుడు హనుమంతు శివప్రసాద్ పర్యవేక్షించారు.

సంతబొమ్మాళి గ్రంథాలయ అధికారి రామకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు కామరాజు పర్యవేక్షించారు.

పోలాకి గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.మానస



పొందూరు: వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



ఇచ్ఛాపురం: వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆధ్వర్యాన నిర్వహించిన వ్యాసరచన పోటీలో కెజిబివి విద్యార్థులు పాల్గొన్నారు.

కవిటి గ్రంథాలయంలో తెలుగు ఉపాధ్యాయులు పిబికె శర్మ పర్యవేక్షణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పూర్ణచంద్ర బెహరా, డి.వినోద్, డి.నాగేశ్వరరావు, బి.లోకేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా ఆధ్వర్యాన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కె.లత, కూర్మారావు పాల్గొన్నారు.

కొత్తూరు గ్రంథాలయంలో విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల, మహర్షి ఉన్నత విద్యాలయం చదువుతున్న 8,9,10 తరగతులు విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాయాలధికారి టి.ఇందిర పాల్గొన్నారు.

ఆమదాలవలస శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు, తమ్మినేని సూర్యనారాయణ, పి.మోహనరావు, గురుగుబెల్లి రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సత్కారం



సత్కరిస్తున్న డాక్టర్ శ్రీధర్

శ్రీకాకుళం అర్బన్ : కళింగ సామాజిక తరగతి నుంచి వివిధ రంగాల్లో, పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన పలువురిని గురువారం ఘనంగా సన్మానించారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న కళింగ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ దానేటి శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు అమర్నిశలు శ్రమించాలన్నారు. విజేతలుగా నిలిచిన వారిని సత్కరించడం ద్వారా మరింత మందికి ప్రేరణ కలుగుతుందన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో నిర్వహించిన 42వ ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటి వివిధ క్రీడాంశాల్లో మెడల్స్ సాధించిన పైడి సాంబమూర్తి, సెంట్రల్ ఆర్మ్ పోలీస్ ఫోర్స్ పరీక్షల్లో అకిల భారతస్థాయిలో ఆరో ర్యాంకు సాధించి డిఎస్‌పి ఉద్యోగానికి ఎంపికైన కంచరాన అవినాష్, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న పూజారి రమణమూర్తిలను ఘనంగా సత్కరించాచు. కార్యక్రమంలో డాక్టర్ పొట్నూరు సూర్యం, బడుమూరు శ్రీరామ్మూర్తి, పైడి త్రిమూర్తులు, బాడాన జనార్ధనరావు, కొత్తకోట గోవిందరావు, గురువుబెల్లి దామోదరరావు, కూన సింహాచలం పాల్గొన్నారు.



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థతో పాటు వివిధ మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని ఎపి ఎంపిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డివిఆర్ఎం పట్నాయక్, జి.మోషే కోరారు. ఈ మేరకు డిఇఒ గార పగడాలమ్మను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు జూలై నుంచి ఇంక్రిమెంట్లు, మెడికల్ లీవులు, పెన్షనర్ల సమస్యలపై ఆమెతో చర్చించారు. ఇంక్రిమెంట్లు ఈ నెలలో మంజూరు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. డిఇఒను కలిసిన వారిలో పట్టణ శాఖ గౌరవ అధ్యక్షులు తమ్మినేని రామారావు, ప్రధాన కార్యదర్శి జి.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

పెద్దతామరాపల్లిలో కిచెన్ గార్డెన్

నందిగాం: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పెద్దతామరాపల్లి ఆవరణంలో కిచెన్ గార్డెన్ నిర్వహణ లో భాగంగా ప్రధానోపాధ్యాయులు బాలక శంకరరావు ఆధ్వర్యాన వంగ, టమాటా మొక్కలు, వందవరకు నాటారు ఆకుకూరల విత్తనాలు గురువారం చల్లారు. విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాల్లో నిష్ణాతులను చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల రమణరాజు, సంధ్యారాణి పాల్గొన్నారు.



కూరగాయల మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నేత్ర వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- కవిటి

సోంపేట ఆరోగ్యవరం ఆధ్వర్యాన మండలంలోని జగతిలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు శిబిరం కో-ఆర్డినేటర్ సురేష్ తెలిపారు. ఈ నేత్ర పరీక్షల్లో వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న 8 మందికి ఆపరేషన్లకు సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పూడి నేతాజీ, సర్పంచ్ పూడి ప్రసాదరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జునుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని చంపాగల్లి వీధిలో నగరపాలక సంస్థ, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వెలుగులో భాగంగా వార్డు సచివాలయంలో నేత్రి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ఆప్తల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ 45 మంది వృద్ధులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 15 మంది ఉచిత కళ్లద్దాలు, పది మందికి కేటరాక్ట్ ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో లంక రమేష్, కొయ్యాన శ్రీను, సూరాడ కన్నబాబు, సచివాలయం అడ్మిన్ సెక్రటరీ



కవిటి : నేత్రాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

టి.పవన్ కుమార్, వార్డు హెల్త్ సెక్రటరీ ఆర్.తులసీకుమారి పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆప్తలమిక్ వైద్యాధికారి ఐ.జానకిరామయ్య 217 మంది విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో నలుగురు దృష్టిలోపం, ఏడుగురు విటమిన్-ఎ, 12 మంది సాధారణ నేత్ర రోగాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి ప్రధానోపాధ్యాయులు మయూరి మణి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం రత్నం, ఆశా వర్కర్ నారా యనమ్మ, బి.కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జలుమూరు : మండలంలోని చల్లవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు, మెయింటెనెన్స్ పనులు చేయనున్న కారణంగా నిలుపుదల చేస్తామని, విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

జి.సిగడాం : జి.సిగడాం సబ్ స్టేషన్ పరిధిలోని గెడ్డకంచరాం, బాతువ, దేవరవలస, చట్టిపొదిలాం, నడిమివలస, జాడ గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పాలకొండ విద్యుత్‌శాఖ ఇఇ టి.జి.కెమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ మెంటినెన్స్ పనులు, మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఆయా గ్రామస్తులు సిబ్బందికి సహకరించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ లక్ష్మి

సైబర్ నేరాలపై అప్రమత్తం

సోంపేట: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బారువ ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పాలవలసలో గురువారం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆధునికంగా సాంకేతికతను ఉపయోగించి ఏ విధంగా బ్యాంకు ఖాతాలోని సొమ్ములను దోచుకుంటున్నారో మహిళలకు మహిళా పోలీస్ లక్ష్మి తెలియజేశారు. నిర్మానుష్య ప్రదేశాల్లో ఒంటరిగా వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీలైనంతవరకు ఎవరైనా అపరిచిత వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తమ బ్యాంకు ఖాతా వివరాలను గోప్యంగా ఉంచుకోవాలని, ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు. మహిళలు ఆభరణాలు ధరించి ఒంటరిగా నిర్మానుష్య ప్రదేశాలకు వెళ్లకూడదని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులను సన్మానిస్తున్న శ్రీనివాస్ పంతులు

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

వజ్రపుకొత్తూరు : మండలంలోని తాడివాడ మిత్ర ఆశ్రమంలో ధర్మపురి శ్రీనివాస్ పంతులు ఆధ్వర్యాన కార్తీక మాసం సందర్భంగా వనభోజనం, ఆత్మీక సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ మేరకు తహశీల్దార్ బి.అప్పలస్వామి, డిటి వాయిలపల్లి గిరిరాజ్, కిడిసింగి సర్పంచ్ నర్తు లక్ష్మీనారాయణ, ఆర్ఐ పవిత్రలకు దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మనుషులంతా ఒక్కటే అనే భావన కలిగితే సమభావం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ, తమ్మినాన విష్ణుష్, దువ్వాడ ఉమామహేశ్వరరావు, రెయ్యి గణపతి, టి.రామకృష్ణ, విఆర్ఒలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కంచిలి



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

మండలంలోని మఠం సరియాపల్లి పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు స్థానిక జెడ్ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం శంకుస్థాపన చేశారు. ఎం.ఎస్.పల్లిలో రూ.5 లక్షలతో సామాజిక భవనం, రఘుపురంలో రూ.3 లక్షలతో సామాజిక భవనం, రూ.77 లక్షలతో మోడల్ స్కూల్‌లో నాడు-నేడు రెండో దశలో ఏడు అదనపు తరగతి గదుల నిర్మాణం, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.ఐదు లక్షలతో కళావేదిక నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే దిశగా సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. విద్యాభివృద్ధికి అధికంగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఇప్పిలి లోలాక్షి, ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మిడి రామదాస్, సర్పంచ్ కొనపల సురేష్, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, నాయకులు కేశవపాత్రో, బి.ధర్మారావు, పలికిల జయరాం, డొక్కరి బలరాం, ఎంఇఒ శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున ఎంపిపి శ్రీరామ్మూర్తి

'ఫ్యామిలీ డాక్టర్' సేవలు ప్రారంభం

ప్రజాశక్తి- నందిగాం

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టారని ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి తెలిపారు. మండలంలోని పెంటూరులో నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చలమయ్య ఆధ్వర్యాన నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానంతో మండలంలోని అన్ని గ్రామాల్లో నెలలో ఒకరోజు వైద్య శిబిరాలు నిర్వహించి ఇంటింటికీ వైద్యులు వెళ్లి రోగులకు వైద్య సేవలు అందజేసి మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్ జడ్యాడ జయరాం, ఎంపిటిసి అంబోడి విష్ణు, అట్టాడ ప్రభాకరరావునాయుడు, అట్టాడ రమేష్, అట్టాడ సీతారాం, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల బెడద

ఎచ్చెర్ల : మండలంలోని కుక్కల బెడద ఎక్కువగా ఉన్నాయి. ఫరీదుపేట, కింతలి మిల్లు, నవభారత్, బైపాస్ కూడళ్లు, ఇండస్ట్రీరియల్ ఏరియా ఎక్కువగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో వెళ్తున్న వాహనదారుల వెంట పడి భౌ భౌమంటూ భయపడుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పద్మ, ప్రకాష్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

కవిటి: అధికారుల పర్యవేక్షణ, లబ్ధిదారుల సహకారంతో మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతమవుతున్నాయని ఎంపిపి కడియాల పద్మ ప్రకాష్ తెలిపారు. మండలంలోని శిలగాం పంచాయతీలో హౌసింగ్ డిఇ శేషయ్య, ఎఇ సాయికిరణ్, అధికారులతో కలిసి గురువారం జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మాణ పనులను మరింత వేగవంతంగా చేయాలని అధికారులను సూచించారు. డిసెంబరు 21 నాటికి పేదల సొంతింటి కల నెరవేర్చేలా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. దానికి అధికారులు, లబ్ధిదారులు అందరూ సహకరిస్తే పూర్తిస్థాయిలో కార్యక్రమం విజయవంతం అవుతుందని చెప్పారు. ఇటీవల శిలగాం గ్రామ పంచాయతీలోని జగనన్న కాలనీలో చోరీకి గురైన మోటార్‌ను లబ్ధిదారుల అభ్యర్థన మేరకు తిరిగి పునర్నిర్మించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఇచ్ఛాపురం : పట్టణంలోని టిడిపి సీనియర్ నేత, ట్రేడ్ యూనియన్ నాయకులు బల్ల రామారావు ఇటువల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. టిడిపి నిర్వహించిన కార్యక్రమాల్లో రామారావు పాల్గొనేవారని, ఆయన లేని లోటు పుడ్చులేనిదని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కాళ్ల జయదేవ్, నందిక జాని, లీలారాణి, కొండ శంకర్‌రెడ్డి, నందిగాం కోటేశ్వరరావు, కృష్ణయ్య, జిలానీ, ఆర్.జానకిరావు, సంతోష్ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్

మాజీ సైనికులకు ఉచిత స్పర్శ శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తూర్పు రాష్ట్ర ప్రాంత మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత స్పర్శ శిక్షణ, సేవలు అందించనున్నట్లు ఎపి సైనిక సంక్షేమ సంచాలకులు బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శైలజ వేరొక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 19న జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత శిక్షణ, స్పర్శ సేవలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏలూరు, కాకినాడ, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, శ్రీకాకుళం పరిసర ప్రాంతాల మాజీ సైనికులు ఈ కార్యమానికి హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని మాజీ సైనికులు ఈ సేవలను వినియోగించు కోవాలని జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు కటకం పూర్ణ చంద్రరావు కోరారు. మరిన్ని వివరాలకు 8283809351, 9439456757 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.



స్మార్ట్‌కార్డును స్వైప్ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- రణస్థలం

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పిఐఎస్ మిషన్ గుర్తింపు పొందిన హెచ్ఎస్‌బి ఆయిల్ స్మార్ట్ కార్డును స్వైప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులకు హెచ్ఎస్‌బి ఆయిల్ సబ్సిడీపై మంజూరు చేసిన నూతన బంక్ లక్ష్మీనారాయణ ఫిల్లింగ్ స్టేషన్‌ను పాతర్లపల్లికి గతంలో ప్రతిపాదనలు చేశామన్నారు. ఈ మేరకు వైఎస్ఆర్ మత్స్యకార భరోసా పథకంలో హెచ్ఎస్‌బి ఆయిల్ పంపిణీ చేసేందుకు గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్డు ఉన్న మత్స్యకారుల బోటుకు నెలకు 300 లీటర్ల వరకు ఆయిల్‌పై రూ.9 శాతం సబ్సిడీ మంజూరు చేసిందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతిఒక్క మత్స్యకారునికీ రూ.27 వేలు లబ్ధిచేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, టెలికాం డైరెక్టర్ బడి రాంబాబు, ఎఫ్‌డిఒ కె.గంగాధరరావు, ఫీల్డ్‌మేన్ కె.నాగరాజు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో సేవలు

పలాస: ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందుబాటులో సేవలు అందిస్తున్నామని జిల్లా ఆస్పత్రి సమన్వయ అధికారి జె.భాస్కరరావు అన్నారు. పలాస ప్రభుత్వాస్పత్రిని గురువారం సందర్శించారు. ముందుగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సూపరింటెండెంట్ మడే రమేష్‌ను తలచుకొని విచారం వ్యక్తం చేశారు. మంచి వైద్యులను కోల్పోయమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ వైద్యులు చిన్ననాయుడుని నియమించారు. బారువ ఆస్పత్రిలో పనిచేస్తున్న మత్తు వైద్య నిపుణులుగా డాక్టర్ వినోద్ కుమార్‌ను అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధ కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్ సూచనలు మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్, మత్తు వైద్యులను నియమించడంపై మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు వైద్యులు మేఘన, జ్యోత్స్న, వైద్య సిబ్బంది ఉన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న భాస్కరరావు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- కొత్తూరు

ప్రమాదాలు తరచూ సంభవిస్తుండడంతో పోలీసులు రెండు టీమ్‌లుగా విడిపోయి స్థానిక నాలుగు రోడ్ల కూలి వద్ద సిఐ ఆర్.వేణుగోపాలరావు, నివగాంలో ఎస్ఐ ఎం.గోవింద గురువారం వాహనాలను మరమ్మరంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. అతి వేగం, బైక్‌పై ముగ్గురు ప్రయాణం, హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పత్రాలను తనిఖీ చేస్తున్న సిఐ వేణుగోపాలరావు

అన్ని గ్రామాల్లోనూ 'ఉపాధి' పనులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులు ప్రారంభించి కూలీలకు పని కల్పించాలని ఎపిడి బి.శైలజ అన్నారు. మండల ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. కొలతల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రూ.257 కూలి వస్తుందన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. జాబుకార్డు దారునికి పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేన్నారు. అందరు తగ్గట్టు పనిచేయాలన్నారు. సమావేశంలో ఎపిఒ సవృతి, ఐటిలు పాల్గొన్నారు.